
# తశ్వ

బోధనం నర్సిరెడ్డి



కోలుకోలుకోలు కోలో నాసామి
కొమ్మలిద్దరు మంచిజోడు
మాచర్ల సిరిచెంద్రుడమ్మో నాసామి
మనపాల గలిగున్నడమ్మ

కొట్టాలబాయి జోడుమోటల మీద సందమాపున మోటలు గట్టిన జీతగాని పోరలు జోరుగ రాగాలు దీస్తున్నరు. సల్లబూటగావటాన సుట్టుపక్కల అరగోసు దూరందన్క ఆయిగ ఇనిపిస్తున్నె రాగాలు.

ముగ్గురు జీతగాని పోరలు గోపసాని బాయి తాల్లెమ్మటి గుసగుసలాడుకుంట నడుస్తున్నరు. అయ్యాల అష్టమో నయమో తెల్వదుగని, చైత్రమానపు సంద ఎన్నెల. నెలగూకపోతున్నది గుడ్డిగుడ్డి ఎల్తురు. గవుండ్లోల్లు తాల్లెక్కడానికి నడిశినప్పుడు కొద్దిగ తొక్కిడిబడి నలిగిన సన్నటి కాలిబాట. ఇటుపక్క అటుపక్క బాగా నడుముల్లోతు బెరిగి ఎండిపోయిన ఏడెగడ్డి, కామంచి, నక్కపసుపు గంటలు. ఏడెముండ్లు, బూతరాకాసి బట్టలకు అంటుకోకుంట దోతుల్నిప్పి రొండు మతలేశి అడ్డబట్టగట్టి మోకాల్లపైదాక గోసులు బోసుకున్నరు. నక్కపసుపు పూతంటుకోని అందరికాళ్ళు మోకాళ్ళపైదన్క పచ్చగ పసుపు రుద్దినట్లయినయ్.

"పొనుగోటోనికి పోతులేనా? ఇంక ఒంపలైతున్నయిరా!" మాదిగోల్ల పోరడు ఇస్తారి ఊకుండలేక అడిగిండు.

"ఇంకెక్కడొంపలురా అప్పుడే కర్రల్ల కొచ్చిపాయె. పోతులే. ఆని మొదలుతాడు కుమ్మరిస్తున్నదశి నిన్న నీంజూశిన. రొండు మాట్లెక్కి దింపుతున్నడు. చెప్పిండు సాకలోల్ల పోరడు రాములు.

"పోతులో పరపులోగని జర సప్పుడు జెయ్యకురశి. గవుండ్లోళ్ళు కావలిగాస్తున్నరట." కుమ్మరి ఒక్కోడు జర జాగర్త జెప్పిండు.

పొద్దాల్ల పరువు, జుట్లు గత్తిరిచ్చుకున్న సన్నాసోల్లు మెడల సుట్టు రుద్రాక్ష దండలు గుత్తగ గట్టుకున్నట్లు తాటిచెట్ల మెడలసుట్టు కల్లులొట్లు. గుడ్లగువ్వలో, గబ్బిలాలో తెల్వదుగని మదుసుల అలికిడికి తాటిచెట్ల మీదినించి పైకి లేశినయ్. కమ్మలు గదిలి లొట్లుగొట్టుకోని కొద్దిగ సప్పుడైంది. ముగ్గురు పోరలు చెప్పులు సప్పుడు గాగుంట సరసర నడుస్తున్నోల్లల్ల సటుక్కున నిలబడ్డరు.

"ఈ పొనుగోటోడు ఇంకా తాల్లెక్కుతున్నట్టుందేందిరా! లొట్ల సప్పుడైతున్నది."కుమ్మరి ఒక్కోనికి కడుపుల జరంత బయమైంది.

"పొనుగోటోడేడున్నడ్ర పాస్కోడ. ఇంతసేపు సంగీతం కాడ మద్దెల గొట్టిందోడనుకున్నవ్? లొట్లు గాలిగ్గొట్టుకున్నయ్ గని సప్పుడు జెయ్యకు." ఇస్తారి ఇవరించి జెప్పిండు.

కర్ణమోరీ కందిచేలో నాసామి
కన్నెగోసిన బొత్తకింద...
కందిరీగలు పాడుగానో నాసామి
కన్నుసైగలు జెయ్యనియ్యవ్.

ముగ్గురు పోరలు మోటలమీది రాగాలినుకుంట పొనుగోటి లింగని మొదలు తాడు కాడికొచ్చిండ్రు. ఒక్కోడు కిందినించి చెట్టుమీదికి ఎగాదిగ జూశిండు.

"చెడెత్తుపాడు బడ్డది గదర ఇది మోకన్నదే మైతిమి. చేతులమీద రానట్టుంది లొట్టి." ఒక్కోడు చెట్టెత్తును అంచనేసుకుంట అన్నడు.

"మోకు లేకుంటె మాయె నాదగ్గర మోటపగ్గమున్నదిగని. ఒల్లెక్కుతరో ఎక్కురి. మొన్ననే నా చేతులన్ని గొట్కపొయ్యి నొప్పులు బెట్నయ్." చాకలి రాములు తను అయ్యాల్టికి చెట్టెక్కలేనని తప్పుకున్నడు.

గోశిప్పి గట్టిగ కాశెబోసుకోని తుండుగుడ్డ నెత్తికి జుట్టుకోని ఇస్తారి చెట్టు మొదలుకు దండం బెట్టి ఉడుం బాకినట్టు బాకి ఐదారు బాకులల్ల మొగిలికెల్లిపోయిండు. ఇద్దరు అటిటు జూసుకుంట చెట్టుకింద నిలబడ్డరు.

కాలెకాలే బండమీదో
నాసామి
పండమంటడె గుండగొయ్య..
కందిరీగే నడుముదాన్నో నాసామి
కరిగి పోతర ముండకొడకా..

"ఆకాపోన్ని గూడ రమ్మంటె రాకపాయెనేందిర ఒల్లకోల్లం దాపుందుము." దొడ్డికాడ బందుకున్న అప్పయ్యపటేలు కొడుకు సాగర్‌రెడ్డి మీద జరంత కోపమొచ్చింది రాములుగానికి.

"ఎప్పుడన్న మనెంటొచ్చినాడ్ర ఈ కాపోడు, మనం దీస్కపొయ్యి పొయాల్సిందేగని ఎన్నాటి రుడమో ఏమో" ఒక్కోడు జరంత అక్కసు ఎల్లగక్కిండు.

చెట్లుమీద ఇస్తారి ఒకలొట్టిశేరు గరిమట్టకు బెట్టి దెగ్గోశి ఒక్కొక్కలొట్లినించి కల్లు దీశి ఒంపుతున్నడు. అప్పుడప్పుడు లొట్లు దగుల్తుంటె కొద్దిగ సప్పుడైతున్నది

"నువ్వే ఎక్కవైతివేందిర? ఈ మాదిగోడు ఒక్కటే లొట్లసప్పుడు జేస్తున్నడు. ఒల్లన్నొచ్చినా దిక్కులేదు." ఒక్కోనికెందుకో ఇయ్యాల కడుపుల జర గుబులు గుబులుగున్నది.

దూరు జూడూ దుమ్ముజోడో నాసామి
దున్నపోతుల పోరుజూడూ..
పాతగోడల పనుమటంగో నాసామి
పడుసు లంజల బారుజూడు..

ఈ పొడపోతుల మారిగానికియ్యాల ఒక్క పాలన్న నోరూకుంటలేదేందిర? ఒక్కటే పాటలు బాడుతున్నడు మంది నిద్రబోకుంట." బక్కోనికెందుకో ఇయ్యాల చీమ చిటుక్కుమన్నా ఒళ్ళు జల్లుమంటున్నది. రోజూ సంగీతంకాడ మారిగానితోటి రొండుమూడు పాటలన్న పాడిచ్చుకుంటోడు ఇయ్యాల పాటంటెనే ఇనలేకపోతున్నడు.

"అరేయ్ బక్కోడ పగ్గమందుతలేదు. నడిమికెక్కి రావాలె." పైనించి ఇస్తారి గుసగుస పిలిశిండు. బక్కోడు గబగబ లేశి చెట్టు నడుం గలికిబాకి లొట్టి అందుకోని కిందికి జారిదుస్తున్నడు. కింద నిలబడ్డ రాములుగాని చేతికి లొట్టి అందుతున్నది. ఒక్కసారే టార్చిలైటు ఎలుగు తాటిచెట్టు మొగిమీద బడి కిందికి దిగింది. రాములుగాడు లొట్టిడిశిపెట్టి ఒక్కసారే చీకట్లకు లగాయించిండు.

** ** **

తెల్లారి దొరోరి చావడికాడ కల్లుదొంగల్ని పంచాయితికి బెట్టిండ్రు. బక్కోన్ని, ఇస్తారిని చావట్ల యాపచెట్టుకు కట్టేశిండ్రు. గవుండ్లోల్లందరు పెద్దమనుసులకు మురాబై ఒక్కలొకల్నే పిల్చుకొస్తున్నరు. ఊల్లె పనిపాటలేనోల్లు, ఆ పోరగాల్ల అమ్మయ్యలు, ఆల్లని జీతముంచుకున్న ఆసాములు, ముస్తాదులున్న గవుండ్లోల్లు అంతా అప్పటికే జమైండ్రు. ముస్తాద్దారు నారయ్యపటేలు, ఇంకో ఇద్దరు సూదరోల్ల పెద్దమడుసులు అప్పుడే ఆడికొచ్చిన్రు. సర్పంచ్ నాగిరెడ్డి పటేలే ఇంక రాలేదు.

"మస్కూరోడేడ్ర? సర్పంచ్ కాడికి బొయినాడ్ర ఒల్లన్న" ముస్తాద్దారు అరుగు మీద గుకుంట అన్నడు.

"పొయిండు పటేల మస్కూరు బొయిండు." పొనుగోటి లింగడు తనదే జిమ్మెదారన్నట్టు జెప్పిండు.

"ఏదో పోరలు నోటాగారం బట్టలేక తప్పుజేశిండ్రు. జర రచ్చించురి మారాజులు" కుమ్మరి రాజిగాడూ, పెద్ద మాదిగ ఎంకడూ తమ కొడుకుల్ని ఇడిశిపెడ్తరేమోనని నారయ్య పటేలును బతిలాడబట్టిండ్రు.

"ఏం నోటాగారంర? బువదింటె కడుపు నింతదిగని, గడ్డిదింటె నింతాదిర! ఈల్లిసొంటోల్లనే అప్పుడోముంత, ఇప్పుడోముంత బోస్తనే ఉంటిని. అయినాగని ఆకలికి నా మొదలు తాడుకే ఎసరుబెట్టిరి ముండాకొడుకులు. చీకట్ల ఆ గొలలు బట్టుకోని అటిటు ఒడిబెడ్తె అయిమల్ల కల్లుబార్తయా పాడయ్యి? నిన్నమొన్ననే జర కపిష్కడంతబడ్తుండె లొట్లల్ల. ముంచిరి లంజగొడుకులు ఏదో కొత్తబొత్త గిట్లైనా పోతెపాయ అనుకుందును. ఈ యాడాది మాములెట్ల గట్టాలె? మేం పెండ్లం పిల్లలెట్ల బతకాలె? సరెపోతెపాయెగని మాముల పైకం మీరు గట్టుకోర్ర మీంబోతంగని ఊల్లెనించి." పొనుగోటి లింగడు

మొదల్తాడు బొయ్యిందన్న కోపంల ముస్తాద్దారుకంటె ముంగల తనే తీర్పు జెప్పకపొయ్యిండు.

మాట్లాడేదేందో సర్పంబొచ్చినంకనే మాట్లాడాలని చూస్తున్నడు నారయ్యపటేలు. గవుండ్లోల్లు, సూడొచ్చి నోళ్ళు ఒల్లకాల్లే తీరుతీరుగ తీర్పులు జెప్పుకుంటున్నరు.

"లొట్లు మెడగ్గట్టి ఊరేగియ్యాలె లంజకొడుకుల్ని దెబ్బకు బుద్ధొస్తది."

"మాములపైకం గట్టిందాక ఈపిన గుండ్లు బెట్టాలె ముండాకొడుకులకు మల్లింకోడు బోడు తాల్లకు."

"ఈల్లిద్దరే కాదురా ఇంక శనామందున్నరు. మెత్తగ నాలుగు దగిలిస్తె అందరి పేర్లు జెప్పుతరు లంజకొడుకులు."

ఆపతి ఆల్లదుగాదు గాబట్టి మంది ఒల్లకు దొశినట్టు ఆల్లు మాట్లాడుకోని, ఆల్లే పంచాత్తశ్వజేసే పెద్దమడుసులయినట్టు తీర్పులు జెప్పుతున్నరు.

"ఏందే లెస్స మాట్లాడుతున్నరు తల్లేదో పెద్ద కుల తప్పు జేశినట్టు? ఆ కాపోల్ల పోరలు దొడ్లకాడ గూకోని పట్టపగులే లొట్లకు లొట్లు దాగుతుంటె దొంగకల్లు ఒక్క గవుండ్లోడన్న సప్పుడు జేస్తుండా? ఇయ్యాలేందో ఇద్దరు గజదొంగల్ని బట్టుకున్నట్టు పంచాయితిబెట్టి మాట్లాడుతున్నరుగని" పట్నంబుచ్చాలు కొడుకు రాగడు అందరిన్న కందిచ్చి మాట్లాడిండు.

"ఒర్నియమ్మ మనకెందుగ్గని ఊకోర. మారాజుల ముంగల మనమేడ నెగుల్తం? ఊరుమురిమి మంగలో నిమీద బడ్డదని మనకు జుట్టుకోగాల?" రాగన్ని సముదాయించిండు మాదిగోల్ల ముసులోడు.

"సర్పంచిని దీస్కరమ్మంటె ఒక్కనివే ఊక్కుంటొస్తున్నవేందిర?" మస్కూరు నర్సిహ్మను గట్టిగ కసురుకున్నడు నారయ్య పటేలు.

"శా దాగొస్తనన్నడు పటేల దండంబెడ్త."

అంటుండంగనే సర్పంచ్ నాగిరెడ్డి పటేలు దోతి శింగులు సదురుకుంటొచ్చి నారయ్యపటేలు పక్కన అరుగుమీద గూకున్నడు.

"ఏందిర ఇంతసేపు రావైతివి ఎండెక్కుతుంటె! పొద్దుగల్ల కతంజేస్తె ఐపొయ్యేదానికి!" ముస్తాద్దారు.

"ఏముందే మామ! నువ్ గానియ్యకపొయినవ్ ఒల్లైతేంది? నీనొస్తనే ఉంటిని."

"ఇంకా ఆల్లని గట్టేశింద్రేందిర? తాల్లిప్పి ఇసుంట దీస్కరారి. ఇంతమందిని గాదని ఉరుకుతారు." సర్పంచ్ అంటుండంగనే మస్కూరు నర్సిమ్మ పొయ్యి పోరగాల్ల కట్టిప్పి అరుగు దగ్గరికి తీసుకొచ్చిండు. పోరలిద్దరు చేతులు గట్టుకోని నేలకు జూసుకుంట పక్కన నిలబడ్డరు.

"ఏంరా! కల్లుకు బాయినార్ర రాత్ర" బైస్ మొదలు బెట్టిండు సర్పంచ్.

పోరగాల్లు నేలకు జూసుకుంట సప్పుడు జెయ్యలే.

"సప్పుడు జెయ్యరేందిరా! పొయింద్రా? పోలేదా?"

"పొయినంపటేల." ఇద్దరొక్కపాలే అన్నరు.

"ఒలోల్లు బొయింద్రురా! మీరిద్దరేనా? ఇంకోల్లన్న ఉన్నరా?"

"ఇంకోల్లేరు పటేల! మేమిద్దరమే ఉన్నం! దండంబెడ్తం."

ఇద్దరొక్కసారే సర్పంచ్ కాల్లమీదబడి లేశి మల్ల ముస్తాద్దారు కాల్లు బట్టుకోని బొలబొల ఏడ్వబట్టింద్రు.

"ఇద్దరంటరేందిర! చాకలి రాములుగాడు ఉరికిండు పటేల! ముగ్గుర్ని కుర్దుగ జూస్తినేను" పానుగోటి లింగన్నోటి గలిశి దొంగల్ని బట్టుకున్న దోర్నాల మశ్యగౌడు సర్పంచుకి సాక్షం జెప్పిండు.

"సరెగని నువ్వుండర! ఆ...యాడగూకోని తాగుతరో... ఒల్లోళ్ళు దాగుతరో... ఆల్లపేర్లు గూడ జెప్పురి మరి! మీతోపాటు ఆల్లకింత దండుగేస్తె ఐపొద్ది."

నారయ్యపటేలు కల్పించుకోని అన్నడు. ఆయన కూపీలాగాల్నని చూస్తున్నడు. ఆయనకు, అప్పిరెడ్డి పటేలుకు నడుమ చిన్న గిట్టుపంచాయితున్నది. ఎట్లన్న అప్పిరెడ్డి కొడుకు సాగర్‌రెడ్డి పేరు జెప్పించి జరంత ఇజ్జతు తియ్యాల్నని చూస్తున్నడు.

"ఒల్లేరు పటేల మీ మ్ముగ్గురం బొయినంగని రాములుగాడు- ఉరికిండు" ఇద్దరు ఒక్కపాలే అన్నరు.

"మరెటు బోయిందురు రాములుగాడు! యీడుండో పట్టరాపోరి ఆన్నిగూడ" నాగిరెడ్డి పటేలు అన్నడు.

"లేడు పటేల! ఆడు సందకాడ దొడ్లకాడికి బొయ్యి మల్లింటికే రాలే! ఎటు బొయ్యిండో ఏమో!" రాములుగాని తండ్రి ఈరిగాడు బయం. బయంగ జెప్పిండు.

"ఆడేడికి బోతడు! ఆగడ్డాములల్ల యీడబండుకుం

**జనం ఒల్ల మాటలల్ల ఆల్లున్నరు. సర్పంచ్ నాగిరెడ్డి మటుకు ఈళ్ళు మాట్లాడుకున్నది కనిపెట్టిండు. ఈ ముండాకొడుకులు కాపోల్ల ఇజ్జతు దీస్తట్టే ఉంది ఇయ్యాల అనుకున్నడు. కాపోల్ల పోరలు ఒలోల్లు దొంగకల్లు దాగుతరో ముస్తాదురుకెరికే. సర్పంచ్ కెరికే**



డోగని మీసంగజ్జెప్పురి! ఒలోల్లు దాగుతరో ఆల్లపేర్లు గూడ జెప్పురి. ఆల్లు బొమ్మంటెనే పొయింద్రు మీదేం తప్పులేదులే?" ముస్తాద్దారు.

పంచాయితికాడ మందిల నిలబడ్డ సాగర్‌రెడ్డికి ఒంట్లె జల్జరం బుట్టింది. ఆడ నిలబడబుద్ధిగాక చిన్నగ ఇంటికి జారుకున్నడు. నాగిరెడ్డి పటేలు అది కనిపెట్టిండు. ఇంక ఎక్కువసేపు పొడుగుజేస్తె కులపోల్ల పేర్లు గూడ బైట బెట్టిసైట్టున్నది ఈ ముస్తాద్దారుగాడు అని అనుకున్నడు మతి.

"ఇప్పుడీల్లు ఒల్ల పేర్లు జెప్తేంది మామ! ఈల్లు జెప్పంగనే ఆల్లు దొంగలైతరాగని, ఇప్పటికీల్ల సంగతి జూద్దాంపటు."

తొందరబెట్టిండు సర్పంచ్ నాగిరెడ్డి

సర్పంచ్ మతిల సంగతి తెలిశింది ముస్తాద్దారుకు" ఈల్ల నిప్పుడేం జేస్తంర! ఆరాములుగాడు దొరికిందాక చివట్ల గట్టేశి, ముగ్గుర్ని గలిపి లొట్లు మెడకేశి ఊరు దిప్పి మాముపైకం గట్టియ్యాలె." ముస్తాద్దారు తన తీర్పు చెప్పిండు- జల్ది జల్దిన.

ఇస్తారికి, బక్కోనికి బయంతోటి ఒల్లంత ఉడుకెత్తింది. రాములుగాడు ఆనత్తగారూరు కొత్తగూడెం బొయినాలె. ఆన్ని బట్టుకొచ్చి ముగ్గుర్ని గల్పి ఊరు ధిప్పుతున్నట్లు అప్పుడే కన్పడుతున్నది ఆల్లకండ్లకు.

"ఏందిర ఇస్తారి! ఆకాపోల్ల పేర్లుగూడ చెప్దాం పట్రాదురో! తీస్కపోతె తాగుతూ కాపోల్లు... మనమేమొ బదునాంగావాల్నా!" బక్కోడు ఇస్తారి చెవుదగ్గర చిన్నగ అన్నడు.

జనం ఒల్ల మాటలల్ల ఆల్లున్నరు. సర్పంచ్ నాగిరెడ్డి మటుకు ఈళ్ళు మాట్లాడుకున్నది కనిపెట్టిండు. ఈ ముండాకొడుకులు కాపోల్ల ఇజ్జతు దీస్తట్టే ఉంది ఇయ్యాల అనుకున్నడు. కాపోల్ల పోరలు ఒలోల్లు దొంగకల్లు దాగుతరో ముస్తాదురుకెరికే. సర్పంచ్ కెరికే.

"ఏందిరో ఏందో మీరు మీరే మాట్లాడుకుంటున్నరు? మామ్లగడ్తరా చెప్పురిమరి!" అన్నడు నాగిరెడ్డి.

"మీమెందుగ్గడ్తం పటేల! మీందెచ్చిపోస్తె తాగిటోల్లేమొ బానే ఉంటరు. మీమేమొ ఒట్టం గట్టాల్నా?"

బక్కోడు మెల్లగ బయట బడుతున్నడు.

"ఏందిరో ఇంతసేపో తీరు ఇప్పుడో తీరుగ మాట్లాడుతున్నవ్? ఒల్ల పేరు జెప్పి ఒల్లని బదనాం జేద్దామనుకుంటున్నవుర కుమ్మరోడ? బుద్ధి తక్కువపని జేసింది గాక మందిని బదనాం జేస్తాంర? ముడ్లిరుగుత్తె బిడ్డ ఏమనుకుంటుంద్రో.."

నాగిరెడ్డి పోరగాల్లని బెదిరిచ్చిండు. కాపోల్ల పేర్లు బైటికి రాకముందే పంచాయితిని తశ్వజెయ్యాల్నను కున్నడు.

"ఇగో ముస్తాద్దారు మామా! గవుండ్లోల్లూ అందరిటు నురిజెర! ఈ పోరగాల్లు ఒరాసులు దొశినోల్లుగారు, కుప్పలు దోశినోల్లుగారు, ఒగల ఇండ్లకు కన్నాలేశినోల్లుగారు. అంతకంటె పెద్దపెద్ద తప్పులు జేశినోల్లే కోర్టుకు బొయ్యి తప్పించుకుంటున్నరు. అసోంటిది గింతంత కల్లు దాగినందుకే ఈల్లకు లొట్లు మెడకేశి ఊల్లె దిప్పాల్నా? లంజకొడుకులు ఇజ్జతుకు జెస్తె ఒల్లది జిమ్మెదారి? ఏదో జెరబుద్ధి జెప్పి ఒదిలిపెడ్దాం పట్రాదురి."

నాగిరెడ్డి ముస్తాద్దారును జూసుకుంట అన్నడు.

నారయ్య పటేలు సర్పంచ్ మాటదిప్పుతున్నడని తెలుసుకున్నడు. తను గట్టిగ మాట్లాడితె ఊల్లె కులపోల్లతోటిగూడ టంగొస్తెట్టుందని అనుకున్నడు.

"ఏంజేస్తవో మరి నీ ఇష్టమొచ్చినట్టే జెయ్యరాదుర! ఆ గవుండ్లోల్లుగూడ పెండ్లం, పిల్లలు బతుకాల్నాయె, మా మ్ల గట్టాల్నాయె- జర అదిగూడ ఓచన జెయ్యిమరి."

ఇంత దండుగన్నేస్తె బాగుంటుందని అనుకున్నడు నారయ్యపటేలు. అయితె సర్పంచ్ నోటినుంచి ఆమాటొస్తదేమోనని చూస్తున్నడు.

"గవుండ్లోల్ల మాములేందే! ఆల్ల మామ్ల ఈళ్ళు గడ్తరా? ఒట్టంలేదు గిట్టంలేదు. బేలగెట్లెమ్మటి పోతెప్పుడు ఓ కంకోకాయో తెంపుకోని తింటలేమా మనమంత! గిదిగూడంతే అనుకోంద్రి. కాకుంటె రాత్రిపూట పోవటం ఈ పోరగాల్లు చేసిన తప్పు. అందుకు ఈల్లను ముక్కు నేలకు రాపిద్దాం. మల్ల ఊల్లె ఒల్ల తాల్లుబొయినా ఈల్లనే జిమ్మిదారు జేద్దాం! అసలంత రాత్రిపూట పురుగుంటది- బూశుంటది. ఆ చెట్ల మీదినించి కిందబడితె లంజగొడుకుల బొక్కలు పులుసులగ్గూడ దొరకలే. అంత పానాలమీదికి దెచ్చుకొని కల్లు దాగాల్నార ముండాకొడుకుల్లార! ఇయ్యాల్నించి ఊల్లె యాడ తాల్లుజొయినా మీరే జిమ్మెదారి నాకొడకల్లార! ఏమనుకుంటున్నరో ఏమో.. చెంపలేసుకోని ఎల్లిపోరి" అని నాగిరెడ్డి ఆల్ల ఈపుల మీద రొండు సరిశిండు.

పోరలిద్దరు చెంపలేసుకొని పటేండ్లిద్దరికి దండం బెట్టి మందిల గలిశింద్రు.

నాగిరెడ్డి మీద నారయ్య పటేలుకు గొంతుల్దాక కోపమొచ్చింది. "ఈ నాయకన్నాళ్ళు సాగుతుందో చూద్దాం" అనుకున్నడు మతిలి.

"గీసక్కదనాల పంచాయితిని గింతకంటేఏంజేస్తం మామ! కంచెడు కల్లుకు జుల్మానులేశి, లొట్లు మెడకేశినుట్టు నాలుగూర్లల్ల నౌబాట్ల పేరు దెచ్చుకునేది తప్పిస్తె!"

నాగిరెడ్డి తనకుతనే మద్దజ్జెప్పుకుంట లేచి దోతి శింగులు జదురుకుంట ఇంటిదిక్కు బొయిండు. ముస్తాద్దారు, గవుండ్లోల్లు మొకాలు జూసుకుంటున్నరు. ●